

కలెక్టర్‌చే ఇవిఎం గొడౌన్ తనిఖీ

ప్రజాశక్తి - ఏలూరు


జిల్లాకు చెందిన ఎన్నికల సామగ్రి భద్రపరచే గోడౌన్‌ను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సాధారణ తనిఖీ ప్రక్రియలో భాగంగా గురువారం సందర్శించినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఉన్న ఇవిఎం యంత్రాలు, వివిప్యాట్ భద్రపరిచే గోడౌన్‌ను సందర్శించారు. గోడౌన్‌కు వేసిన సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఇవిఎం గొడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట డిఆర్ఒ పుష్పమణి, కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.కాశీవిశ్వేశ్వరరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ఏర్పాట్లన్నీ పూర్తి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నేటి నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ థియరీ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఏలూరు జిల్లా వృత్తి విద్యా శాఖాధికారి, జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ బి.ప్రభాకరరావు, పశ్చిమగోదావరి జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్, ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 101 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో పశ్చిమగోదావరి జిల్లాలో 50, ఏలూరు జిల్లాలో 51 పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. అలాగే పశ్చిమగోదావరి జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 17,806 మంది పరీక్షలు రాయనుండగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 18,143 మంది మొత్తం 35,949 మంది పరీక్షలు రాయనున్నారు. అలాగే ఏలూరు జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 15,656 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 16,789 మంది మొత్తం 32,445 మంది పరీక్షలు రాయనున్నారు. మొత్తం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 68,394 మంది పరీక్షలు రాయమన్నారు. ఈ పరీక్షలు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి. పబ్లిక్ పరీక్షల్లో ఎలాంటి అవకతవకలూ జరగకుండా అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఆన్‌లైన్ స్ట్రీమింగ్‌తో ఏర్పాటు చేశారు. అన్ని కెమెరాలూ జిల్లా కేంద్రంలోని కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానమై ఉంటాయి. అలాగే ఇంటర్ బోర్డు నుంచి ఒకరు, రెవెన్యూ శాఖ నుంచి ఒకరు, పోలీస్ డిపార్టుమెంట్ నుంచి ఒకరు మొత్తం ముగ్గురితో మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేశారు. వీరు నిరంతరం అన్ని కేంద్రాలనూ పర్యవేక్షిస్తూ ఉంటారు. అలాగే అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షా కేంద్రాలకు వంద మీటర్ల వరకు జిరాక్స్ షాపులు మూసివేస్తారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యంతోపాటు గదుల్లో తగినంత వెంటిలేషన్ ఉండేలా చర్యలు చేపట్టామని ఇరు జిల్లాల అధికారులు తెలిపారు. అన్ని కేంద్రాల్లో ఒఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లతో ఒక ఎఎన్ఎం ఉండేలా వైద్యఆరోగ్య శాఖ ద్వారా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఉదయం ఏడు గంటల నుంచి పరీక్ష కేంద్రాలకు బస్సులు అందుబాటులో ఉండేలా, ఆ బస్సుల్లో విద్యార్థులకు ప్రాధాన్యతిచ్చేలా చర్యలు తీసుకున్నామని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులకు కూడా కలెక్టర్ తగిన ఆదేశాలు జారీ చేశారని వారు తెలిపారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఒక నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. మాల్ ప్రాక్టీస్ జరిగితే సంబంధిత డిపార్టుమెంట్ ఆఫీసర్, చీఫ్ సూపరింటెండెంట్‌పైనా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.


పాలకొల్లులో ఇంటర్ పరీక్షల కోసం వేసిన బెంచీలు

సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, 1214 మెమోను రద్దు చేయాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న వెల్ఫేర్ బోర్డును నిర్వీర్యం చేశారన్నారు. వారికి గతంలో సంక్షేమ పథకాలు అమల చేసేవారని, జగన్ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక సంక్షేమ పథకాలన్నీ ఆపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు నిలుపుదల చేస్తూ ఇచ్చిన 1214 జిఒలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం భవన నిర్మాణ సెస్ సొమ్మును భవన నిర్మాణ కార్మికులకు ఖర్చు పెట్టాలని చెప్పినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ మెటీరియల్ ధరలు నియంత్రించాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, దారిమళ్లించిన భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులు రూ.1150 కోట్లు వెనక్కు జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాధరావు, యూనియన్ నాయకులు పరస శ్రీను, కోనపు రెడ్డిరాజా, ఎస్‌కె.భాషా, ఆకుల దుర్గారావు, కొరడా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెదపాడు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు కొనసాగించాలని, దారి మళ్లించిన నిధులను వెంటనే వెల్ఫేర్ బోర్డు ఖాతాలో జమ చేయాలని జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) నగర కార్యదర్శి మెరుగు వీరరాఘవులు డిమాండ్ చేశారు. అప్పనవీడు గ్రామంలో చేపట్టిన భవన నిర్మాణ కార్మికుల రిలే నిరాహార దీక్షలనుద్దేశించి రాఘవులు మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న వెల్ఫేర్ బోర్డు నిధులను వారి సంక్షేమానికి వినియోగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పథకాలకు సంక్షేమ బోర్డు నిధులను మళ్లించడం దారుణమని విమర్శించారు. తక్షణమే వెల్ఫేర్ బోర్డును కొనసాగించాలని, లేనిపక్షంలో భవన నిర్మాణ కార్మికులకు, రవాణా రంగ కార్మికులు సంపూర్ణ మద్దతు ప్రకటించి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. వాసు, శ్రీనివాసరావు, నాగమల్లికార్జునరావు, జగన్, రవితేజ తదితరులు భవన నిర్మాణ కార్మికులకు మద్దతు తెలిపారు.




ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

గంజాయి నియంత్రణకు పటిష్ట చర్యలు

విక్రేతలపై పీడీ యాక్ట్
కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్‌పి డి.మేరీప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరుస్పోర్ట్స్

గంజాయి సరఫరా, వినియోగించే వారిపై ఆరు నెలలపాటు కనీస జైలు శిక్ష, ఇతర చట్టపరమైన చర్యలు ఉంటాయనే విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసి అటువంటి చర్యలకు పాల్పడే వారిని నియంత్రించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సిఒఆర్‌డి) జిల్లాస్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. గంజాయి నియంత్రణ, డ్రగ్స్ అక్రమ రవాణా తదితర అంశాలపై సంబంధిత శాఖలు తీసుకున్న చర్యలపై ఎస్‌పి డి.మేరీప్రశాంతితో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి నియంత్రణలో నిఘా పెంచడంతోపాటు గంజాయి తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. గంజాయి వినియోగం డిమాండ్ తగ్గించే దిశగా పటిష్టమైన చర్యలు ఉండాలన్నారు. గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలతోపాటు విద్యార్థి దశలోనే పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన పరిచి చెడు అలవాట్లపై యువత పెడదోవ పట్టకుండా చూడాలన్నారు. దీనిపై హైస్కూలు ఉపాధ్యాయులు, పీడీలకు అవగాహన కల్పించాలని ఎస్‌ఇబి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గంజాయి అనుమానాస్పద కేసుల్లో పట్టుబడిన వారికి డ్రగ్ డిఅడిషన్ సెంటర్‌లో ఒకరోజుపాటు అవగాహన, కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. అనుమానాస్పద షీట్లులో ఉన్న వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పూర్తిస్థాయి నిఘా పెట్టాలన్నారు. ప్రయివేట్, ఆర్‌టిసి కార్గో రవాణా మార్గాలపై కూడా పటిష్టమైన నిఘా ఉంచాలన్నారు. జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి మాట్లాడుతూ గంజాయి రవాణా, సరఫరా, వినియోగం నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఎఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ ఇతర ప్రాంతాల నుంచి జిల్లా మీదుగా రవాణా జరుగుతుందని, దానిని అరికట్టేందుకు పూర్తిస్థాయి దాడులు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో డిఆర్ఒ డి.పుష్పమణి, కమిటీ సభ్యులు దేవి, దీక్షిత, డాక్టర్ చంద్రహాస్, డి.ధనిష్టబత్తుల, అడ్వకేట్ కె.సత్యనారాయణ, డిఇఒ ఎస్.అబ్రహాం, ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ అబీబ్‌భాషా, జిల్లా ప్రజా రవాణాధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్, ఎన్‌టిసిపి సైకలాజిస్ట్ కెసిహెచ్.వీర్రాజు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ జె.బాలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, ఎస్‌పి మేరీప్రశాంతి

చురుగ్గా పట్టిసీమ ఉత్సవాలకు ఏర్పాట్లు

ఫెర్రీ కాంట్రాక్టర్ మైగాపుల సత్యనారాయణ

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమలో నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఫెర్రీ కాంట్రాక్టర్ మైగాపుల సత్యనారాయణ అన్నారు. గోదావరి నదిపై నడక మార్గం ఏర్పాటుకు డ్రెడ్జింగ్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే దాదాపు మూడు శాతం పనులు పూర్తయ్యాయని, గోదావరి నదిలో మార్గమునకు పంటులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే అధికారులకు చలువ పందిళ్లు వేశామని, టికెట్ బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సుమారు రెండు లక్షల మంది యాత్రికులు వస్తారని తెలపడంతో నడిచేందుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రెవెన్యూ డిపార్ట్‌మెంట్ వారు పనులను పరిశీలిస్తున్నారన్నారు. గోదావరి నది నుంచి ఆలయం వరకు ఇసుక తెన్నెల్లో రహదారి మార్గంలో యాత్రికులు సేద తీర్చుకునేందుకు చలువ పందిళ్లు, నదిలో స్నానం చేసిన యాత్రికులు బట్టలు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు ఉత్సవాలకు రెండు రోజుల ముందే పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. పనులు చురుగ్గా సాగుతున్నాయని ఫెర్రీ కాంట్రాక్టర్ మైగాపుల సత్యనారాయణ, బొరుసు రాంబాబు తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న విఆర్ఒ వెంకటేశ్వరరావు

తూతూమంత్రంగా ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

నేతల మధ్య బయటపడిన విబేధాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లిలో గన్నమని కాంప్లెక్స్ వద్ద మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమం తూతూ మంత్రంగా జరిగింది. టిడిపి మండల స్థాయి నాయకులు లేకుండా స్థానిక నాయకులు కొంతమంది కలిసి కార్యక్రమం నిర్వహించడంపై పార్టీలో నాయకుల మధ్య ఉన్న విబేధాలు బహిర్గతమయ్యాయని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి అధినాయకత్వానికి పిలుపు వెళ్లినా వారు కూడా రాకపోవడంతో పాటు పొత్తులో ఉన్న జనసేన నాయకులు కూడా డుమ్మా కొట్టడంతో తూతు మంత్రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోరగం శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌ఎ శ్రీనివాస్, పారేపల్లి రామారావు, టిడిపి కార్యదర్శి డి.శ్యామ్ సుందర్, మండవ లక్ష్మణరావు, సాంబ, పుల్లయ్య, రాజబాబు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరైన టిడిపి నేతలు

అన్నదమ్ముళ్ల నడుమ సయోధ్యా.. సమరమా..!

ఎంఎల్‌ఎ రామరాజు, మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజు మధ్య సయోధ్యకు ఎంపీ రఘురామకృష్ణంరాజు ప్రయత్నం
రసకందదాయకంగా 'ఉండి' రాజకీయం

ప్రజాశక్తి - భీమవరం, కాళ్ల

వచ్చే ఎన్నికల్లో వరుసకు అన్నదమ్ముళ్ల మధ్య సమరమా.. లేక సయోధ్య అనే ఉత్కంఠ ఉండి నియోజకవర్గవాసులతోపాటు జిల్లా ప్రజల్లో నెలకొంది. ఉండి ఎంఎల్‌ఎ ఎమ్మెల్యే మంతెన రామరాజు, మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) మధ్య టిక్కెట్ విషయంలో ఏర్పడిన తగాదా తారాస్థాయికి చేరింది. శివరామరాజు మద్దతు కోరేందుకు వచ్చిన రామరాజుతో మాట్లాడేందుకు నిరాకరించడంతో రామరాజు కంగుతిని అవమానభారంతో వెనుదిరిగారు. ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో శివ వైసిపి గూటికి చేరి బరిలోకి దిగుతారనే ప్రచారం ఒకవైపు, స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతారనే ప్రచారం మరోవైపు పెద్దఎత్తున సాగుతోంది. ఈ క్రమంలో రామరాజు, శివరామరాజు మధ్య సయోధ్య కుదిర్చేందుకు సయోధ్య కుదిర్చేందుకు నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు రంగంలోకి దిగినట్లు తెలిసింది. మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజును బుజ్జగించేందుకు హైదరాబాద్ తీసుకెళ్లినట్లు సమాచారం. అలాగే రామరాజును కూడా హైదరాబాద్ పిలిపించారనే ప్రచారం సాగుతోంది. రఘురామకృష్ణంరాజు నరసాపురం ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగితే ఉండిలో వీరు ఇరువురి మధ్య నెలకొన్న విబేధాల ప్రభావం తనపై పడే అవకాశం ఉండటంతో రఘురామకృష్ణంరాజు నేరుగా రంగంలోకి దిగారని చెబుతున్నారు. ఇప్పటికే జనసేన గూటికి చేరేందుకు సిద్ధమైన భీమవరం మాజీ ఎంఎల్‌ఎ శివను బుజ్జగించేందుకు ప్రయత్నించిన సంగతి తెలిసిందే. రఘురామకృష్ణంరాజు జోక్యంతో రామరాజు, శివరామరాజు మధ్య సయోధ్య కుదురుతుందా లేక సమరమేనా అనే చర్చ విస్తృతంగా సాగుతోంది. టిడిపికి కంచుకోటలో వీరిద్దరి మధ్య సయోధ్య కుదరకపోతే వైసిపి విజయకేతనం ఎగురవేస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.


శివతో మాట్లాడేందుకు యత్నిస్తున్న రామరాజు (ఫైల్‌ఫొటో)

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత

ఎంఎల్‌ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్
రూ.21 కోట్లతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, స్థానికంగా రూ.21 కోట్లతో ఆధునిక వైద్య సదుపాయాలతో ఆసుపత్రి నిర్మాణం అందుకు తార్కాణమని నూజివీడు ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. గురువారం నూజివీడులో రూ.21.15 కోట్ల నాబార్డు నిధులతో నూతనంగా నిర్మించిన ప్రభుత్వాసుపత్రిని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో కలిసి ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఎన్నో సంస్కరణలు అమలు చేస్తున్నారన్నారు. నూజివీడు ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేకంగా మోకాళ్లకు ఆపరేషన్ చేసే ప్రక్రియను ప్రారంభించారని, నెలకు సుమారు 30 ఆపరేషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ప్రసూతి కాన్పులు, ఆపరేషన్లు నెలకు 250 ఈ ఆసుపత్రి ద్వారా జరుగుతున్నాయన్నారు. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా ఈ ఆసుపత్రిలో 23 మంది యువ డాక్టర్లతో రోగులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ వైద్య సేవలకు నూజివీడు ఏరియా ఆసుపత్రికి నాక్ ధ్రువీకరణతోపాటు మూడుసార్లు కాయాకల్ప అవార్డులను పొందిందన్నారు. ఈ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్స్, ఇఎన్‌టి, డెంటల్, ఫిజియోథెరఫీ, ప్రసూతి, జనరల్ మెడిసన్, జనరల్ సర్జరీ, చంటి పిల్లల వైద్యం తదితర వైద్య సేవలు రోగులు పొందుతున్నారని తెలిపారు. మరీ ముఖ్యంగా ఈ ఆసుపత్రిలో 20 బెడ్స్ కిడ్నీ పేషెంట్లకు డయాలసిస్ కింద సేవలందించడానికి ఏర్పాట్లు ఉన్నాయని, దీనికి అపోలో, లయన్స్ క్లబ్ ద్వారా డయాలసిస్‌కు సంబంధించిన మిషనరీలు సమకూర్చారన్నారు. పాత ఆసుపత్రిలో మూడు ఆపరేషన్ థియేటర్లు ఉండగా కొత్త ఆసుపత్రిలో ఆరు ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయని చెప్పారు. రాబోయే రోజుల్లో నూజివీడు ఏరియా ఆసుపత్రిని వంద పడకల నుండి 200 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. మరీ ముఖ్యంగా ఈ నూతన ఏరియా ఆసుపత్రిలో గుండెపోటుకు సంబంధించిన స్టేమి కూడా ఏర్పాటు చేశామని, రూ.40 వేలు ఖరీదు చేసే ఇంజెక్షన్ ఉచితంగా గుండెపోటు వచ్చిన వారికి ఇవ్వడం ద్వారా వారి ప్రాణాలను కాపాడగలుగుతామని తెలిపారు. ఏలూరు జిల్లా ఏరియా ఆసుపత్రి తర్వాత రెండో స్థానంలో నూజివీడు ఆసుపత్రి ఉందన్నారు. త్వరలో నూజివీడు క్రీడా స్టేడియం ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తామన్నారు. అలాగే రూ.25 కోట్లతో రింగ్‌రోడ్డు ఏర్పాటు, రూ.6 కోట్లతో పీజీ సెంటర్ భవన నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. ఐసియు వార్డును కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రారంభించగా జనరల్ వార్డులను ఆర్‌డిఒ వై.భవానీశంకరి ప్రారంభించారు. వివిధ యూనిట్లను ప్రజాప్రతినిధులచే ప్రారంభించారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి సభ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక, కారుమూరి సునీల్‌కుమార్, ఎపి కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ, వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, డిసిహెచ్‌ఎస్ బి.పాల్‌సతీష్‌కుమార్, డాక్టర్ నాగేశ్వరరావు, 26, 27వ వార్డు కౌన్సిలర్లు మల్లిశెట్టి ప్రియదర్శిని, గాజుల సీతకుమారి, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ఏరియా ఆసుపత్రిని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎంఎల్‌ఎ

రాష్ట్రస్థాయి పోటీలకు బొర్రంపాలెం విద్యార్థులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు రాష్ట్ర స్థాయి ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎండి ఆలీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి భవిష్యత్తులో గొప్ప వ్యాపార వేత్తలుగా ఎదగడానికి దోహదపడతాయన్నారు. ఈ నెల ఆరో తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

పెళ్లయిన వారానికే..

రోడ్డు ప్రమాదంలో వరుడు మృతి - వధువు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - మొగల్తూరు

'పెళ్లయి వారం రోజులైనా కాలేదు. నవ వరుడు తన అభిమాన నేత పవన్ కళ్యాణ్ సభకు వెళ్లి అక్కడ నుంచి స్నేహితుడిని కలిసి ఇంటికి తిరిగి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందడంతో పెళ్లింట పెనువిషాదం నెలకొంది. ఈ విషయం తెలియగానే నవ వధువు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో అంతా ఉలిక్కిపడ్డారు. ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం మొగల్తూరు మండలం కొత్తోట గ్రామానికి చెందిన ఏనుగుల చక్రపాణి, ఆదిలక్ష్మి దంపతులకు కుమారుడు ఏనుగుల అంజిబాబు (31), కుమార్తె ఉన్నారు. ఈ నెల 24న అంజిబాబుకు పాలకొల్లు మండలం లంకలకోడేరుకు చెందిన శిరీషాతో వివాహమైంది. అంజిబాబు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వీరాభిమాని. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 28వ తేదీ బుధవారం తాడేపల్లిగూడెంలో జరిగిన జెండా సభకు ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. అక్కడ నుంచి ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలో ఉన్న స్నేహితుడిని కలవడానికి వెళ్లి వెంటనే ఇంటికి మోటారు సైకిల్‌పై బయల్దేరాడు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అంజిబాబు జేబులో ఉన్న గుర్తింపు కార్డుల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వృద్ధులైన అంజిబాబు తల్లిదండ్రులు, లంకలకోడేరులో ఉన్న భార్య శిరీష శోకసంద్రంలో మునిగిపోయారు. తీవ్ర మనస్తాపానికి గురైన శిరీష విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది గమనించిన కుటుంబీకులు హుటాహుటీన ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. వికలాంగులైన అంజిబాబు తల్లిదండ్రుల పోషణభారమంతా అంజిబాబు చూస్తున్నాడు. పెళ్లయి వారం రోజులు కాకుండానే ముంచుకొచ్చిన మృత్యువుతో ఆ గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.


అంజిబాబు (ఫైల్‌ఫొటో)

మూడో రోజు కొనసాగిన టెట్ పరీక్షలు


ఏలూరుసిటీ : జిల్లా కేంద్రమైన ఏలూరులో టెట్ పరీక్షలు గురువారం మూడో రోజు కొనసాగాయి. సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, సిద్ధార్థ క్వెస్ట్, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం పరీక్షకు 369 మంది హాజరు కావాల్సి ఉండగా 333 మంది హాజరయ్యారు. 36 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 369 మందికిగాను 338 మంది హాజరయ్యారు. 31 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డిఇఒ అబ్రహం తెలిపారు.

ఓటు హక్కు వినియోగం సామాజిక బాధ్యత

రిటర్నింగ్ అధికారి, ఐటిడిఎ పిఒ సూర్యతేజ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఓటు హక్కు వినియోగంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఓటు హక్కు వినియోగించుకోవడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని పోలవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ అన్నారు. మండలంలోని పివిటిజి గ్రామమైన ముంజలూరులో గురువారం నిర్వహించిన ఓటర్ల అవగాహన చైతన్య కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటుహక్కు ప్రాముఖ్యతను విశదీకరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటుహక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా(ఇవిఎం) ఓటు వినియోగించుకోవడంపై గిరిజన కొండ రెడ్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బుట్టాయగూడెం తహశీల్దార్ వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ గంగరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, ఐటిడిఎ పిఒ సూర్యతేజ

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

విధుల్లో అలసత్వం వహించిన సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి గురువారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. ముదినేపల్లి మండల పరిషత్ ప్రాథమిక ఉర్దూ పాఠశాలలో టి.అంజనేయులు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఆయన గత రెండు నెలలుగా ఉదయం పాఠశాలకు ఆలస్యంగా వస్తూ విధుల పట్ల అలసత్వం వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి అభియా గుర్తించారు. ఇతని దినచర్యపై నివేదిక పొందిన అనంతరం విధుల పట్ల అలసత్వం వహించినందుకు అంజనేయులును సస్పెండ్ చేస్తూ గురువారం రాత్రి డిఇఒ ఉత్తర్వులు జారీ చేశారు.

ట్రిపుల్ ఐటి విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కోర్ కంపెనీల్లో ప్లేస్‌మెంట్స్ పొందినట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం. చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించిన ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 మంది విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు స్టైపండ్ పొందుతున్నట్లు తెలిపారు. ఇంటర్న్‌షిప్ పూర్తయ్యాక కంపెనీలో విలీనం చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధి హామీ పని దినాలు ప్రతిఒక్కరూ తమకు కేటాయించిన వందరోజుల పని దినాలను పూర్తి చేయాలని ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవి, ఎపిఒ టి.రోజీలేత అన్నారు. మండలంలోని వలసపల్లి, గుళ్లపూడి, ముసునూరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎపిఒ మండల ఎపిఒ టి.రోజీలేత ఆధ్వర్యంలో ఎంపిడిఒ చాగంటి పద్మావతిదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు, టెక్నికల్ అసిస్టెంట్లు వారంలో కనీసం నాలుగైదు రోజులు పనులను పరిశీలించాలని, పని ప్రదేశంలో కూలీలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని చెప్పారు.

నూజివీడు రూరల్ సిఐగా రామకృష్ణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు రూరల్ సిఐగా రామకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సిఐగా బాధ్యతలు నిర్వహించిన బాల సురేష్ తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లికి బదిలీ అయ్యారు. దేవరపల్లి నుంచి రామకృష్ణ నూజివీడు రూరల్‌కు బదిలీపై వచ్చారు.

బాలికకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం రూరల్

ముచ్చేట్ల క్రిత రోడ్డు ప్రమాదానికి గురైన బాలిక పూడి భవానికి డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఇన్సూరెన్స్ ద్వారా రూ.50 లక్షలు ఇప్పించడానికి చేసిన కృషి అభినందనీయమని రోటరీ అసిస్టెంట్ గవర్నర్ దాకారపు కృష్ణ అన్నారు. డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పూడి భవానికి ఇన్సూరెన్స్ ద్వారా వచ్చిన నగదును దాకారపు కృష్ణ చేతులమీదుగా గురువారం అందించారు. ఈ సందర్భంగా దాకారపు కృష్ణ మాట్లాడుతూ 2021లో పూడి భవాని జంగారెడ్డిగూడెం బైపాస్ రోడ్డులో రోడ్డు ప్రమాదానికి గురైంది. వైద్యులు ఆమె కాలుకు ఆపరేషన్ చేయాలని తెలిపారు. ఈ విషయాన్ని రోటరీ క్లబ్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణ సాయం రూ.50 వేలు అందించినట్లు చెప్పారు. మరికొంతమంది దాతలను సమీకరించిన డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘ సభ్యుల సేవలను కొనియాడారు. రోటరీ ప్రతినిధి కెవిఎస్.ధనకుమార్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ఏర్పడిన డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం సేవా కార్యక్రమాలతో పాటు చైతన్య కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ముచ్చేట్ల క్రిత జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలిక పూడి భవానికి అండగా నిలిచి స్ఫూర్తినిచ్చారని తెలిపారు.

ఆళ్ల నానిని కలిసిన రవికుమార్

ప్రజాశక్తి - కామవరపుకోట

ఏలూరు ఎంఎల్‌ఎ ఆళ్ల నానిని ఆయన క్యాంపు కార్యాలయంలో విజిలెన్స్ కమిటీ జిల్లా సభ్యులు గుర్రాల రవికుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చింతలపూడి నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులను ఎంఎల్‌ఎ ఆళ్ల నానికి వివరించినట్లు రవికుమార్ తెలిపారు. కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

'రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేనదే విజయం'

ప్రజాశక్తి - కామవరపుకోట

రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టిడిపి కూటమి అఖండ మెజార్టీతో గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందని జనసేన కామవరపుకోట మండల అధికార ప్రతినిధి యన్నంశెట్టి గాంధీబాబు అన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో అన్ని తరగతుల ప్రజలు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

నేరాలు - ఘోరాలు

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ముసునూరు

కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని వలసపల్లిలో వెలుగు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వలసపల్లి గ్రామానికి చెందిన మల్లినేని లక్ష్మణరావు కుమారుడు మల్లినేని సురేష్(38)కు బుధవారం అధిక కడుపునొప్పి రావడంతో తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి అదేరోజు సాయంత్రం మృతి చెందాడు. అతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గురువారం మృతుని భార్య శ్రావణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు.

మంచులవారిగూడెంలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని సీతప్పగూడెం పంచాయతీ శివారు మంచులవారిగూడెంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం సంభవించి గిరిజనుడు తెర వెంకటేశ్వరరావుకు చెందిన తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లింది. బీరువాలో రూ.40 వేల నగదు కాలి బూడిదైంది. బాధితులకు తక్షణ సహాయం కింద ప్రభుత్వం నుంచి 25 కేజీల బియ్యం, కూరగాయలు, నూనె, రూ.వెయ్యి నగదు తహశీల్దార్ వెంకటేశ్వర్లు, సీతప్పగూడెం పంచాయతీ ఉప సర్పంచి సరియం చెల్లయ్య చేతుల మీదుగా అందించారు. వారితో పాటు సీనియర్ అసిస్టెంట్ గంగరాజు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

తిరుపతిపాడు ఆలయంలో చోరీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని వల్లంపట్ల పంచాయతీ తిరుపతిపాడులో ఉన్న రామాలయంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... తిరుపతిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఫిబ్రవరి 26వ తేదీన సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ పురస్కరించుకుని హుండీలో సుమారు రూ.లక్ష నగదు, అమ్మవారి మెడలోని బంగారు వస్తువులు చోరీకి గురైనట్లు వారు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఇంట్లో గొడవ పేడుడ్డంతో మనస్తాపానికి గురైన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కుక్కునూరు మండలం కుక్కునూరు గ్రామానికి చెందిన కె.రవీంద్ర వ్యవసాయ పనుల నిమిత్తం మండలంలోని పి.అంకంపాలెంలో తన అక్క ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఎప్పటిలాగే గురువారం పొలంలో పని ముగించుకుని ఇంటికి రాగా చిన్న గొడవ పడ్డారు. ఆ క్రమంలో మనస్తాపానికి గురైన రవీంద్ర పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు అతడిని హుటాహుటిన జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ స్తంభం... ప్రమాదకరం

తుప్పు పట్టిన వైనం
ఎప్పుడు పడిపోతుందోనని
ప్రజల భయాందోళన
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని దాచారం పంచాయతీ బెస్తగుడెం ఎస్‌సి కాలనీ దానూరి నాగేశ్వరరావు ఇంటి వద్ద విద్యుత్ స్తంభం విరిగి పడిపోయే పరిస్థితిలో ఉంది. విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల నుంచి విద్యుత్ స్తంభం సమస్య గురించి దానూరి కోటి అనే వ్యక్తి లైన్‌మెన్‌కి తెలియజేస్తున్నా చేద్దాం, చూద్దామని సమయం గడుపుతున్నారే తప్ప సమస్య పరిష్కరించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు విద్యుత్ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారూ స్పందించడంలేదని వాపోతున్నారు. ఇనుప స్తంభం కావడంతో అక్కడ ఉన్న ప్రజలు ప్రమాదానికి గురయ్యే అవకాశం భయాందోళనకు గురవుతున్నారు. రానున్న వేసవికాలంలో వీచే ఈదురుగాలి వల్ల స్తంభం విరిగి చుట్టుపక్కల ఉన్న ఇళ్లమీద పడే పరిస్థితి కనిపిస్తుందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. మరమ్మతులకు గురైన ఇనుప విద్యుత్ స్తంభాన్ని తీసేసి దాని స్థానంలో సిమెంట్ స్తంభాన్ని వేయాలని ప్రజలు అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇనుప స్తంభం పూర్తిగా తుప్పు పట్టడంతో అది ఎప్పుడు పడిపోతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదకరమని తెలిసినా అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధికారులు స్పందించి ఇనుప విద్యుత్ స్తంభం స్థానంలో సిమెంట్ స్తంభం ఏర్పాటు చేసి ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని, సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



తుప్పు పట్టి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

పౌరహక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఉంగుటూరు

రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులపై ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి సామాజిక తరగతి వారు అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహశీల్దార్ బొడ్డేపల్లి దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని కైకరంలో ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒ భీమవరపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో వాలంటీర్లదే కీలక పాత్ర

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడంలో సచివాలయ, గ్రామ, వార్డు వాలంటీర్లదే కీలక పాత్ర అని పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు అన్నారు. స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తెల్లం రాజ్యలక్ష్మితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలవ్యాప్తంగా గ్రామాల్లో ప్రజలకు ఉత్తమ సేవలందించిన గ్రామ, వార్డు, వాలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులు, ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందించారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అనంతరం మండలంలోని జీలుగుమిల్లి, తాటియాకులగూడెం గ్రామాల్లో పలు సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. పాలచర్ల రాజవరం గ్రామంలో రైతులకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసిన సొసైటీ గొడౌన్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొర్స పోసమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావు, సర్పంచులు చిర్రి జగదాంబ, సున్నం ఉషారాణి, భోగేశ్వరరావు, కుంజా పార్వతి, వరలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, సొసైటీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు ప్రసాద్, వైస్ ఎంపిపిలు ఎస్.శ్రీనివాస్, లతాకుమారి, తహశీల్దార్ ఆర్‌వి.వెంకటేశ్వరావు, ఎంపిడిఒ కెఎం.మంగతాయారు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో పేదలకు న్యాయం

ముదినేపల్లి : వైసిపి ప్రభుత్వంలో పేదలందరికీ న్యాయం జరుగుతుందని, పెయ్యేరు గ్రామస్తులకు అతి త్వరలోనే ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పెయ్యేరు గ్రామస్తులు ఎంపిపి సత్యనారాయణను తన కార్యాలయంలో గురువారం కలిసి తమ సమస్యలను వివరించారు. ఎన్నో ఏళ్లుగా తమ సమస్యలు పట్టించుకోవడంలేదన్నారు. సొంత ఇల్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఎంపిపి సత్యనారయణ స్పందించి మాట్లాడుతూ అర్హులందరికీ వెంటనే ఇళ్ల స్థలం, ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన గ్రామస్తులతో కలిసి తహశీల్దార్ కుమారిని కలిసి సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు.

కాంగ్రెస్‌లోకి 30 మంది

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని చీరవల్లి గ్రామానికి చెందిన బిజెపి నాయకుడు బాణాల వీరాచారి గురువారం కాంగ్రెస్‌లోకి చేరారు. మొత్తం 30 మంది బిజెపి నుంచి కాంగ్రెస్‌లోకి చేరారు. కాంగ్రెస్ మండలాధ్యక్షులు రాజు ఆధ్వర్యంలో చేరారు. బిజెపిలో పని చేసిన వారికి గుర్తింపు లేదని వీరాచారి అన్నారు.

జిల్లా ఎన్నికల మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

అధికారులకు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా ఎన్నికల మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ ఆవరణలోని భవన్‌లోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో జిల్లా ఎన్నికల మీడియా సెంటర్, ఎంసిఎంసి కేంద్రాల ఏర్పాటు అంశాన్ని అధికారులతో కలిసి కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో త్వరలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి సమాచారాన్ని మీడియా ద్వారా ప్రజలకు అందించేందుకు కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. అంతేకాకుండా ఎన్నికల సమయంలో అభ్యర్థులకు సంబంధించిన ఎన్నికల ప్రకటనలకు అనుమతులు మంజూరు చేసేందుకు మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. అందుకు సంబంధించి వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా పౌర సంబంధాధికారి ఆర్‌విఎస్.రామచంద్రరావును కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎన్నికల మీడియా సెంటర్, ఎంసిఎంసి కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని డిఆర్‌ఒ పుష్పమణి, కలెక్టరేట్ పరిపాలనాధికారి కాశీ విశ్వేశ్వరరావులను కలెక్టర్ ఆదేశించారు.

విద్యార్థులు భయపడకుండా పరీక్షలు రాయాలి

పోలవరం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - పోలవరం

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ఈ నెల ఒకటో తేదీ నుంచి, రెండో సంవత్సరం పబ్లిక్ పరీక్షలు రెండో తేదీ నుంచి ప్రారంభమవుతున్నట్లు పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆయన కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 31 మంది, సెకండ్ ఇయర్ విద్యార్థులు 38 మంది, సప్లమెంటరీ ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులు 26 మంది, గూటాల జూనియర్ కళాశాల నుంచి ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులు 15 మంది మొత్తం 101 మంది పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే పరీక్షా కేంద్రానికి హాజరవుతున్నారని తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఒకటో తేదీ నుంచి 14వ తేదీ వరకు, రెండో సంవత్సర విద్యార్థులకు రెండో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి సమయానికి ముందుగా చేరుకోవాలని, పరీక్షకు సంబంధించిన సామగ్రిని మర్చిపోకుండా తెచ్చుకోవాలని, భయపడకుండా పరీక్షలు రాయాలని, మంచి మార్కులతో ర్యాంకులు సాధించి ఉత్తీర్ణత పొందాలని, కాలేజీకి మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, లెక్చరర్లు కోరారు.

ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జీవరత్నం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ఉపాధి హామీ చట్టం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.జీవరత్నం, మండల కార్యదర్శి ఎ.ప్రభాకరరావు డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం ప్రజాసంఘాల కార్యాలయంలో సంఘం మండల కమిటీ సమావేశం సీత అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.జీవరత్నం, ఎ.ప్రభాకరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనికి సంబంధించి మండలంలో కూలీలకు రూ.40 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉందని, వాటిని తక్షణమే చెల్లించాలని కోరారు. ఇప్పటివరకు చేసిన పనికి ప్లే ష్లిప్‌లు ఇవ్వాలన్నారు. ఆరు వారాలుగా పని చేస్తున్న పే స్లిప్‌లు ఇవ్వడంలేదని, ఉపాధి హామీ నిధులను నిర్వీర్యం చేసి తూట్లు పొడుస్తున్నారన్నారు. కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్‌ను, ఎపిఒలను పే స్లిప్‌లు అడుగుతున్నా ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. ఎండలు పెరగడంతో వేసవిలో పని చేస్తున్న కూలీలకు మజ్జిగ, తాగునీరు, టెంట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా ప్రతి కూలికి రూ.600 వేతనం ఇచ్చి కుటుంబానికి 200 రోజులు పని కల్పించి, చేసిన పనికి ప్రతిరోజు ప్లేస్లిప్పులు ఇవ్వాలని కోరారు. మండలంలో అడిగిన వారందరికీ జాబ్‌కార్డులు అధికారులు ఇవ్వటం లేదని, అరకొర పనులు కల్పించి చెరువుల్లో యంత్రాలతో పనిచేయించి నిధులు దారి మళ్లిస్తున్నారని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, లేకపోతే సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలను ఐక్యం చేసి సమస్యల పరిష్కారానికి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కె.సుబ్బారావు, గరికిపాటి రాంబాబు, వి.నరసరావు, పిల్లి చంటి, కలపాల వెంకటేష్, సిహెచ్.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భారతీయ విద్యానికేతన్‌లో సైన్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా ప్రతిరోజు బడికి వెళ్తే మంచి మార్కులతో విజయం సాధించవచ్చని ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవి తెలిపారు. మండల కేంద్రమైన ముసునూరు భారతీయ విద్యా నికేతన్ హైస్కూలులో సైన్స్ డే వేడుకలు కరస్పాండెంట్ కొండేటి విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ చాగంటి పద్మావతిదేవి, ఎంఇఒ బివి.సుబ్బారావులతో కలిసి సైన్స్ విజ్ఞాన కేంద్ర పరికరాలను విజయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సివి రామన్ వంటి ఉన్నత వ్యక్తితో పోల్చుకుని విద్యార్థులు ప్రతిభ కనబరచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.శౌరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏలూరులో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మండలంలోని శ్రీపర్రులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు గురువారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రూ.1.90 కోట్ల వ్యయంతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్, మైక్రో ఫిల్టర్ బెడ్స్‌ను, రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. రూ.7 లక్షలతో కల్వర్టు నిర్మాణ పనులకు, రూ.ఆరు లక్షలతో తాగునీటి బోరు, రూ.30 లక్షలతో రామాలయం వద్ద కళ్యాణ మండపం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మానూరు, మహేశ్వరపురం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రూ.74 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. రూ.10 లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు, రూ.10 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంపిపి పి.శ్రీనివాసరాజు, వైసిపి మండలాధ్యక్షులు తెర ఆనంద్, జెడ్‌పిటిసి సభ్యులు సరస్వతి కొండలరావు, వడ్డీల కార్పొరేషన్ ఛైర్మన్ సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

3న పల్స్ పోలియో జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ నెల మూడో తేదీన జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కె.గోకవరం పిహెచ్‌సి వైద్యాధికారి ఆర్.కృష్ణకిషోర్ పిలుపునిచ్చారు. వ్యాక్సినేటర్లతో గురువారం నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు బిడ్డలకు పోలియో చుక్కలు అందించే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి హుస్సేన్ మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బందిని, స్వచ్ఛంద సంస్థలను సమాజంలో అందరినీ భాగస్వాములు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రగడవరం వైద్య సిబ్బందితో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అభిద, ఉమామహేశ్వరరావు, రాణి రూట్ ఆఫీసర్స్ విష్ణుమూర్తి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చాట్రాయి : ఈ నెల 3వ తేదీన చిన్నపిల్లలకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ మంగాకుమారి పిలుపునిచ్చారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమంపై గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అందరం కలిసికట్టుగా పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. వైద్యాధికారి ఎ.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మండలంలో 32 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఐదేళ్ల లోపు పిల్లలు 5327 మంది ఉన్నారని, వారందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని చెప్పారు. ఆదివారం జరిగే పల్స్‌పోలియో కార్యక్రమంలో అందు బాటులో లేని పిల్లలకు 4, 5 తేదీల్లో తమ వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ ఒ జివి.రమణ, ఆశా కార్యకర్తలు, ఇఒపిఆర్‌డి మురళీకృష్ణ, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

మండవల్లి : పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని లోకముడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ఆశ తెలిపారు. భైరవపట్నంలో పల్స్ పోలియోపై వైద్య సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల మూడో తేదీన పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించేలా వైద్య శాఖ చర్యలు చేపట్టిందన్నారు. ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు శిబిరంలో ఉండి ప్రతిష్టాత్మకంగా పోలియో చుక్కలను వేయాలన్నారు. ఈ పోలియో చుక్కలను అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా వేయాలన్నారు. పోలియోను దేశం నుంచి తరిమికొట్టడంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విజిటర్ నాగలక్ష్మి, మేల్ వర్కర్ రహీం, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పామాయిల్ గెలల కత్తిరింపులో జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పామాయిల్ తోటల్లో గెలలు, మట్టల కత్తిరింపు దశలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎపిఎస్‌పిడిసిఎల్ అసిస్టెంట్ ఇంజినీర్ బాబూరావు సూచించారు. మండలంలోని మీర్జాపురం ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. పామాయిల్ తోటల్లో గెలలు, మట్టల కత్తిరింపు దశలో తగిన జాగ్రత్తలు చేపట్టాలని రైతులకు సూచించారు. ఇనుప జిఐ పైపులతో ఏర్పాటుచేసిన గెడ కత్తులను వినియోగించి పామాయిల్ గెలలు, బట్టలు కత్తిరస్తారని, దీంతో విద్యుదాఘాతంతో పలు ప్రమాదాలు సంభవిస్తాయని చెప్పారు. ఇపున పైపులతో గెలలు, మట్టలు కోయవద్దని సూచించారు. ప్రతి రైతు భద్రతా నియమాలు పాటించి, తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు.

సీనియర్ జర్నలిస్ట్ నాగకుమార్ మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, ఎపియుడబ్ల్యూజె జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్‌వి.నాగకుమార్(54) మృతి చెందారు. నాగకుమార్ ఆంధ్రభూమి బుట్టాయగూడెం విలేకరిగా సుదీర్ఘకాలం పని చేశారు. ఎలక్ట్రానిక్ మీడియాలో పలు ఛానళ్లకు విలేకరిగా పనిచేశారు. ఎపి యుడబ్ల్యూజె ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా శాఖ కోశాధికారిగా, సహాయ కార్యదర్శిగా, స్టేట్ కౌన్సిల్ సభ్యునిగా యూనియన్‌కు సేవలందించారు. ఫ్రీ లాన్సర్ అక్రెడిటేషన్ మంజూరు కాగా తెచ్చుకోవడానికి నాగకుమార్ బుధవారం విజయవాడ వెళ్లారు. విజయవాడ బస్ కాంప్లెక్స్‌లో వాష్‌రూమ్‌కు వెళ్లి అక్కడ పడిపోయి మృతి చెందారు. నాగకుమార్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. జంగారెడ్డిగూడెంలో నాగకుమార్ నివాస గృహం వద్ద ఆయన మృతదేహాన్ని పలువురు యూనియన్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. నాగకుమార్ మృతికి ఐజెయు జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, పట్టణ ప్రముఖులు సంతాపం తెలిపారు.



నాగకుమార్ (ఫైల్)

పరిశుభ్రతపై అవగాహన

నూజివీడు రూరల్ : మండలంలోని మిట్టగూడెం గ్రామంలో డాక్టర్ వైఎస్‌ఆర్ హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు గురువారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని రోడ్లు, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య అలవాట్లపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండొచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.విజయలక్ష్మి, కళాశాల సిబ్బంది, సర్పంచి నరసింహారావు పాల్గొన్నారు.